వాళ్లలా మాట్లాడుకుంటూండగానే హోటల్ ముందు నుంచి ఓ పోలీస్ జీపు సాగిపోతూంది.

జీపులో సుందర్, సాగర్‌లతో పాటు వెనక కాటికాపరి తవిటయ్యా కూర్చుని వుండటం స్పష్టంగా కనిపించింది.

"గుడ్" నవ్వాడు రామసూరి ""విషయం మనదాకా రావడంతో చేసేదేమీ లేక సుందర్ శవాన్ని కలెక్ట్ చేసుకోవడానికి వెళుతున్నాడు యశస్వీ. నువ్వెళ్ళి రెస్టు తీసుకో. ఈ లోగా నా ప్రయత్నం నేను చేస్తాను."

యశస్వికి అర్థం కాలేదు.

"సాయంకాలం పత్రికలో చూడు. చాలా పెద్ద అక్షరాలతో పబ్లిష్ అవుతుంది" రామసూరి వెళ్లాడు.

తన మార్బలంతో సమాధుల మధ్యకు వచ్చిన సుందర్ కట్టెలపై వున్న అనసూయ శవాన్ని చూశాడోమారు.

విచ్చుకుంటున్న వెలుగు రేఖల నడుమ ఆరిపోయిన ఓ కాంతిరేఖలాంటి ఆమెను చూస్తూ సుందర్ స్పందించిపోలేదు.

"దీన్ని పోస్ట్ మార్టంకి పంపండి" అతడి వాక్యం పూర్తికాకముందే నలుగురు కానిస్టేబుల్స్ శవాన్ని జీపులోకి ఎక్కించారు.

"బాస్టర్డ్" డి.ఎస్పీ సుందర్ అప్పుడలా తిట్టింది హత్య చేసిన హరిని అనుకున్నాడు తవిటయ్యా.

కాదని గుర్తించడానికి పట్టింది అరక్షణమే!

డొక్కలో తగిలిన పిడికిలి దెబ్బకి నేలకొరిగిన తవిటయ్యాను చూస్తూ

"పెద్ద హరిశ్చంద్రుడనుకుంటున్నావా?" అన్నాడు తోడేలులా నవ్వుతూ.

"పైగా అర్థరాత్రి వచ్చి నిద్ర పాడుచేస్తావా?"

మరో దెబ్బ....

"హరి చంపి తీసుకొచ్చాడని అబద్ధం చెబుతావా?"

తను చెప్పింది నిజమని తెలిసిన తవిటయ్యా అతను చూడనిది నిజం కాదని ఎందుకనుకుంటున్నాడో అర్థంకాక బాధతో విలవిల్లాడుతూనే ఏదో చెప్పాలని పెదవి విప్పబోయాడు.

డి.యస్పీ బూటుకాలు పొట్టలో తాకింది వేగంగా.

ఆ మూలుగుతో ఉలికిపడి నిద్రలేచిన నానీ గుడిసెలోనుంచే భయంగా చూశాడు.

ముందు అర్థం కాలేదు జరుగుతున్నదేమిటో.

అర్థం అయ్యేసరికి బయటకొచ్చే ధైర్యం చేయలేకపోయాడు.

"హరి చంపినట్టు నువ్వు చూసావట్రా. పైగా నువ్వు చెప్పింది నిజమని నేన్నమ్మాలా!"

అదంతా చూస్తున నానీ ఒణికిపోతున్నాడు.

'నిజం"పోలీసుల కందించు- అంటూ రాందేవ్ చివరగా అన్న మాటలు గుర్తుకొచ్చి మరి నిజం చెబితే తాతయ్యని కొడతారేం అనుకుంటూ గుడ్ల నీళ్ళు కక్కుకుంటున్నాడు.

“కొట్టకండయ్యా” రొప్పుతున్నాడు తవిటయ్య “నిజం సెప్పి నాలా కాటికాపరయిన హరిచ్చెంద్రుడు కథ తెలిసినోడ్ని. కాని కాటికాపరయిన నాలాటోడు నిజం సెపితే ఒచ్చే నష్టం తెలుసుకోలేకపోయాను. నన్ను
సంపకయ్యా!”.

“నిన్నూ” సమస్యను అనవసరంగా మరింత జటిలం చేసిన తవిటయ్యపై కోపం ఇంకా ఉధృతమై పోతుంటే కొనవూపిరితో కొట్టుకుంటున్న ఆ వృద్ధుడిని పైకి లేవకుండా చేసే చివరి ప్రయత్నంగా కాలెత్తాడు.

ఆ దెబ్బ తగిలివుంటే అనసూయ శవానికి సాక్షముండదు. బహుశా సుందర్ ఉద్దేశ్యం కూడా అదేనేమో.

వేగంగా వెనక్కి లాగారెవరో!

తన ఉద్రేకాన్ని గ్రహించిన తన స్టాఫ్ ఆ ప్రయత్నానికి పూనుకున్నారని ముందు అనుకున్నాడు. కానీ కాదని తరువాత అర్థమైపోయింది.

సుందర్ చేతిని బలవంతంగా పట్టుకుని ఎలాంటి పర్యవసానికయినా సిద్ధపడిన ఆ వ్యక్తి యశస్వి.

ఆవేశంగా ముందుకు రాబోయిన సాగర్, తక్కిన కానిస్టేబుల్స్ “స్టాప్‌దేర్” అన్న యశస్వి కేకతో కంగారుగా ఆగిపోయారు.

అక్కడ అలా ప్రత్యక్షమయిన ఆ 'మంచి అంకుల్' ని రెప్పవాల్చకుండా చూస్తున్నాడు నానీ.

“మహా నిజాయితీపరుడిలా అన్ని కబుర్లూ, సెక్షన్ నెంబర్లూ చెప్పిన డి యస్.పి ! ఇప్పుడు నువ్వు చేస్తున్నదేమిటి? ఒక సాక్షాన్ని ఇలా సమాధి చెయ్యాలనుకుంటున్నావా?” ఆవేశంతో ఊగిపోతున్నాడు యశస్వి.

“యూ బాస్టర్డ్” సుందర్ చేయి విదిలించుకోవడానికి చేసిన ప్రయత్నం యశస్వి ముందు ఫలించలేదు “అరెస్ట్ దిస్ మేన్” ఆదేశించాడు తన సిబ్బందిని చూస్తూ.

ధైర్యం చేసిన కానిస్టేబుల్స్ ఇద్దరూ రెప్పపాటులో నేల కొరిగేట్టు
కుడికాలునుపయోగించాడు యశస్వి.

“మిష్టర్ సుందర్.... మీ వాళ్లని రెచ్చగొట్టి నేరస్తులపై మాత్రమే నే నుపయోగించే చైనా "షిషీచీ' జపాన్ "ఫోటోకారక్' విద్యను ప్రదర్శించే అవకాశం కలిగించకు” ఓ క్షణంపాటు నిశితంగా చూశాడు సుందర్‌ని. “అక్కడ నీ

స్థావరంలో నేను నిజాయితీగా మాట్లాడితే ఐ.పి.సి. 332 అండ్ 333 ల గురించి లెక్చరిచ్చావు.... ఇప్పుడు నువ్వు చేస్తున్నదేమిటి... ఇట్స్ ఏనఫెన్స్ ఎగైనిస్ట్... పబ్లిక్ ట్రాంక్విలిటీ ఎజ్ పెర్ సి ఆ ర్టీసీ 39 అననా లేక సాక్షిని విచారించే క్రిమినల్
ప్రొసీజర్ కోడ్ 161ని నువ్వు ఉల్లంఘించి నీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నావననా.... షేమ్.... షేమ్ యువర్ పార్ట్... అలా చూడకు! ఇపుడు నేను మాట్లాడుతున్నది నీ డిపార్ట్మెంట్లో నీ కన్నా ఓ చిన్న ఆఫీసరుగా కాదు. నీ లాంటి వాళ్ళను నిలదీసి ప్రశ్నించగల ఓ పౌరుడిగా. నన్నెలా కటకటాల వెనక్కి పంపాలని ఆలోచిస్తున్నావేమో.... నేను అన్నింటికీ సిద్ధపడినవాడ్ని సుందర్! సవ్యంగా మీరు ప్రొసీడ్ ఐతే సహకరించే వ్య క్తినవుతాను . లేదా మీకు ప్రత్యర్థినవుతాను. డిసైడ్ యువర్ సెల్ఫ్ అండ్ అరెస్టు ది రియల్ కల్ప్రిట్ మిష్టర్ హరి."

ఇలా హెచ్చరించిన యశస్వి ఆ తర్వాత చేసిన చిన్న పొరపాటు నేలకొరిగిన తవిటయ్య స్థితిపై సాటి మనిషిగా అణువంత మానవత్వాన్ని ప్రదర్శించడమే.

లేవలేక నిస్త్రాణగా పెనుగులాడుతున్న తవిటయ్యకి ఆసరా ఇస్తూ అతడ్ని ఒడిలోకి తీసుకున్నాడు.

దేవుడిలా మధ్యకొచ్చి మంచి తాతయ్యని రక్షించిన పోలీస్ అంకుల్ని ఇక ధైర్యంగా కలుసుకోవాలని నానీ ఓ అడుగు ముందుకేయబోతుండగా చూశాడు సాగర్ లాఠీతో యశస్వి తలపై మోదటాన్ని.

ఓ సన్నని మూలుగు.

బాధగా తల పట్టుకున్న యశస్వి నిస్సత్తువగా నేలపై పడిపోతుంటే ఆసరా ఇచ్చిన కానిస్టేబుల్స్ ఇదే అదను అన్నట్టుగా అతన్ని జీపెక్కించారు.

ఒక నిజాన్ని కాపాడబోయిన మరో "నిజం' ఇలా దెబ్బ తినడం చూసిన నానీ ఇప్పుడిక ధైర్యం చేయలేకపోయాడు.

వెళుతున్న జీపు్ని చూస్తూ నీళ్ళు నిండిన కళ్లతో తవిటయ్యని సమీపించాడు. ఓ క్షణం తవిటయ్య కూడా తన తాతలా కనిపించాడు. దీని కంతటికీ తనే కారణమన్న బాధ.... "తప్పు చేశానా తాతా!"

"లేదయ్యా" తవిటయ్య కళ్ళూ చెమ్మగిల్లాయి "నిజం కోసం హరిశ్చంద్రుడు కాటికాపరైపోయాడు.... ఇప్పుడు నిజం చెప్పిన నేను అరిచ్చెంద్రుడంత గొప్పోణ్ణవుతాను".

** ** ** **

బజర్ మోగిన చప్పుడుతో బడలికగా కళ్ళు తెరిచాడు చంద్రం.... తల దిమ్ముగా వుంది. కిటికీలోనుంచి పడుతున్న సూర్యకిరణాలు లోపలికి ఏటవాలుగా దూసుకొస్తూ సూదుల్లా అతడి ఒంటిపై గుచ్చుకుంటున్నాయి.

మరో మారు బజర్ మోగింది.

అప్పుడు గుర్తుకొచ్చింది రాత్రి బాగా తాగివున్న సమయంలో నానీ రావడం, తను చంపలేక కామేశ్వరి ఫోన్ చేయడమూ అంతా, పక్కన నానీ లేడంటే నానీని అప్పుడే...

బాధగా కణతలు నొక్కుకున్నాడు.

ఒక తండ్రిగా తను అటువంటి పనికి పూనుకున్నందుక్కాదు.

మరో మూడు రోజుల్లో కోర్టుకి హాజరు కావాలి.

ఆ ఆలోచన రాగానే కంపించి పోయాడు! మెదడు నరాలు చిట్లేట్టు మరోమారు బజర్ మోగింది.

"కమిన్" అసహనంగా అరిచాడు.

లోపలికి వచ్చిన వ్య క్తిని విస్తుపోయి చూస్తుంటే "నాపేరు రామసూరి... 'అనుదినం' చీఫ్ రిపోర్టర్ని" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు రామసూరి.

చంద్రం ఆందోళన పడిపోయాడు అప్పుడే రాత్రి జరిగింది బయటికి పొక్కిపోయిందా అన్న భయంతో..... "నాతో మీకేం పని?"

"ఎంతమాట! కన్న బిడ్డకోసం అంగలార్చుకుపోతూ అంతదూరం నుంచి వచ్చిన మీరు, ఒకపక్క భార్య మృతితో మనస్తాపం చెందుతున్న మీకిది గోరుచుట్టు మీద రోకటిపోటులా అనిపించడం తెలిసిన నేను మీ బాధని తెలుసుకోవాలని వచ్చాను."

తప్పనిసరై చంద్రం బాధను అభినయిస్తూనే జవాబు చెప్పాడు. "అవును. నా భార్య ఫైర్ ఏక్సిడెంట్లో చనిపోవడం, ఇంతలోనే వీడు మిస్ కావడం నా దురదృష్టం".

"అర్థమైంది ఆ రోజే"

"ఏ రోజు?" ఈ సారి కొద్దిగా కంగారుపడ్డాడు చంద్రం.

"అదే మా పత్రికలో నానీ కనిపించడం లేదని ప్రకటనిచ్చారుగా"

"మరేం"

"పాపం కష్టమే" మరో అస్త్రాన్ని సంధించాడు రామసూరి "పైగా మీకే కాదు చాలామందికి అవసరమైపోయాడు, ముఖ్యంగా పోలీసులకి" ఇక్కడ ఇంతదాకా మాట్లాడేక ఎడంచేయి గుప్పిటలో వున్న రికార్డర్ ని నొక్కి అరక్షణం ఆపుచేసి "యశస్వి అనే పోలీసాఫీసరు మిమ్మల్ని అనుమానిస్తున్నాడని తెలిసింది" అన్నాడు ఈ వాక్యం రికార్డ్ కాకుండా జాగ్రత్తపడుతూ.

తర్వాత రికార్డర్ ఆన్ చేశాడు.

"అనుమానించడమే కాదు టార్చర్ చేస్తున్నాడు. ఎలాగన్నా నా అంతు చూస్తానని శపథం చేసిన ఆ పోలీసాఫీసర్ ఇప్పుడదే పనిలో బిజీ అయిపోయాడు" ఉద్రేకంగా చెప్పాడు.

చంద్రం నుంచి సరిగ్గా ఇలాంటి జవాబు నాశించే రికార్డర్ 'ఆఫ్' చేసి యశస్వి పేరు చెప్పింది. రామసూరి అనుకున్నట్టే యశస్వి పేరును కాక 'ఆపోలీసాఫీసర్ అంతు

చూస్తానంటున్నాడు' అని జనరలైజ్ చేశాడు. అది చాలు
ఆ పోలీసాఫీసర్ డి.ఎస్పీగా తన ఇంటర్వ్యూలో అన్వయించడానికి.

"నిజమే చంద్రంగారూ.... ఒకపక్క గనికొండ సమస్యలో మీ వాడ్ని అడ్డం పెట్టుకుని ప్రెస్‌లో అబద్ధం మాట్లాడిన హోం మినిష్టర్‌కి, అతనికి సంబంధించిన ఫిల్మ్ రోల్ నానీ దగ్గర వుందని భావిస్తూ మంత్రిగారికి సహకరించాలని ఆలోచిస్తున్న ఆ పోలీసాఫీసరుకీ నానీ శత్రువై పోయాడు. నానీని ప్రాణాలతో మీకు
అప్పచెప్పేట్టు నా పత్రికపరంగా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తాను. శలవ్" అనాల్సింది గడగడా అనేసి రికార్డర్ "ఆఫ్' చేసి పైకిలేచాడు ఇక తక్కిన చర్చ రికార్డు కాకూడదన్నట్టుగా.

" ఆ పోలీసాఫీసర్‌కి నానీ శత్రువు కావడమేంటి.... నేను అంటున్నది
యశస్వి
విషయం....." తొట్రుపడుతూ అన్నాడు చంద్రం.

రామసూరి వెళ్ళిపోయాడు చంద్రం ప్రశ్నకి జవాబు చెప్పకుండా.

సరిగ్గా అప్పుడు గదిలోకి అడుగుపెట్టారు కామేశ్వరీ, రాజారావులు.

"నువ్వే అసమర్థుడివి" అక్కసుగా అంది కామేశ్వరి ""లేకపోతే నానీని అలా వదిలిపెట్టేవాడివికాదు."

బిత్తరపోయిన చంద్రం "రాత్రి నీకు ఫోన్ చేశానుగా. ఇప్పుడు నానీ కనిపించకపోయేసరికి నువ్వో, ఆ మినిష్టర్ మనుషులో తీసుకు పోయారని అనుకుంటున్నాను" అన్నాడు అంతవరకూ అదే అనుకుంటూండటంతో.

"నీ మొహం మండ..... ఇప్పుడందర్నీ ఇరికించావు. ఎలా చస్తావో చావు.
మేం అనకాపల్లి వెళ్ళిపోతున్నాం."

"అదికాదు కాముడూ... ఇప్పుడేమైంది?"